కాంగ్రెస్ అభ్యర్థి వేధింపులతోనే బీఆర్ఎస్‌లోకి..


వర్ధన్నపేట: బీఆర్ఎస్‌లో చేరిన వారితో అరూరి రమేష్


హసన్‌పర్తి: మాట్లాడుతున్న రమేష్

- నియంతలా వ్యవహరిస్తున్న నాగరాజు
- బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి రమేష్

వర్ధన్నపేట: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేఆర్ నాగరాజు నియంతలా వ్యవహరిస్తూ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని దీంతో బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బీఆర్ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. శనివారం మండలంలోని నల్లబెల్లి గ్రామానికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జక్కి శ్రీకాంత్ నాయకత్వంలో 250 మంది వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు రమేష్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ నేడు పార్టీ కార్యకర్తలనే విస్మరించేవాడు ఎన్నికల్లో గెలిస్తే నాగరాజు ప్రజలను ఎన్ని ఇబ్బందులకు గురి చేస్తాడో ప్రజలు గమనిస్తున్నారన్నారు. తాను నియోజకవర్గంలోని ఏ పల్లెకు వెళ్లిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, వారి హృదయాల్లో నిలవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. మూడో సారి గెలిపించాలని, మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలను 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడిన ఎర్రబెల్లి వరదరాజేశ్వర్ రావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించాడని, మండలాధ్యక్షునిగా ఉన్న తనపై అక్రమ కేసులు బనాయించిన ఘనుడు కేఆర్ నాగరాజు అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడిగా రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన శ్రీకాంత్ అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆంగోతు అరుణ, వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి పాల్గొన్నారు.

నక్సల్స్‌ను పొట్టన పెట్టుకున్నాడు..

హసన్‌పర్తి: నక్సల్స్ బిడ్డలను పొట్టనపెట్టుకున్న వాడికి పవర్ ఇస్తామా.. అని వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్ ప్రశ్నించారు. నగరంలోని 65వ డివిజన్‌తోపాటు మడిపల్లి, మనిపల్లి, హసన్‌పర్తికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీ సీనియర్ నాయకుడు చుంచు రవి ఆధ్వర్యంలో రమేష్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దేవన్నపేటకు చెందిన పలువురు నక్సల్స్ సానుభూతిపరులు కాంగ్రెస్ అభ్యర్థి నాగరాజు బాధ్యతులేనన్నారు. 65వ డివిజన్‌లో దాదాపు బీజేపీ క్యాడర్ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కో–ఆర్డినేటర్ ఎల్లావుల లలితా యాదవ్, మండలాల కో–ఆర్డినేటర్ అంచూరి విజయ్, కార్పొరేటర్ దివ్యారాణి, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ రేణుకుంట్ల సునీత, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, ఆత్మ డైరెక్టర్ భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రవి, వాసుదేవారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, రజనీకుమార్ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు, రౌడీషీటర్ల బైండోవర్

- ఇప్పటి వరకు తహసీల్దార్ ఎదుట 250మంది హాజరు
- 20మంది రౌడీషీటర్లపై నిరంతర పర్యవేక్షణ
- సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా

హసన్‌పర్తి: సాధారణ ఎన్నికల దృష్ట్యా శాంతి భద్రతల పర్యవేక్షణకు పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికార, ప్రతిపక్షాల నాయకులతో పాటు రౌడీషీటర్లను హసన్‌పర్తి పోలీసులు బైండోవర్ చేశారు. ఇప్పటి వరకు మొత్తం 250 మందిని తహసీల్దార్ ముందు హాజరు పరిచారు. రౌడీషీటర్ల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా వేసినట్లు వివరించారు.

బెల్ట్ షాపుల నిర్వాహకులకు కౌన్సెలింగ్

హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో వంద బెల్ట్‌షాపులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈమేరకు బెల్ట్ షాపుల నిర్వాకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల పూర్తయ్యే వరకు ఎవరైనా మద్యం అమ్ముతూ పట్టుబడితే కేసులు నమోదు చేసి జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు.

చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు

పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నాసాగరం వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. వారితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ నిరంతరం తనిఖీలు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు రూ.24 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. నిరంతరం పెట్రోలింగ్ కొనసాగుతున్నట్లు చెప్పారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని ఆయన చెప్పారు.


బెల్ట్‌షాపు నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

క్లుప్తంగా

290 కిలోల నల్లబెల్లం పట్టివేత

రామన్నపేట: టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో 290కిలోల నల్లబెల్లం, 10కిలోల పటికను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వాటి విలువ రూ.24,200 ఉంటుందని పేర్కొన్నారు. మహబూబ్‌బాద్ జిల్లా కేసముద్రం మండలం మంచ్యా తండాకు చెందిన భూక్య చంటి బెల్లం, పటికను మద్యం తయారీకి విక్రయించాడు. మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడు మోరీల సమీపంలో నడుస్తున్న రైలులో నుంచి ఆ సామగ్రిని విసిరేసి, వాటిని మార్చడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో నిందితుడితో పాటు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థులు ఉన్నత ఆలోచనలు కలిగి ఉండాలి

కాజీపేట రూరల్: విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించడం అలవర్చుకున్నప్పుడే ఉన్నతంగా ఎదుగుతారని హనుమకొండ సీడబ్ల్యూసీ మెంబర్, మోటివేషనల్ స్పీకర్ కే.దామోదర్ అన్నారు. కాజీపేట బాపూజీనగర్‌లోని విజేత స్కూల్‌లో శనివారం జరిగిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు సహ విద్య కార్యక్రమాలు క్రీడలు, సాంస్కృతిక, క్విజ్, తదితర పోటీల్లో పాల్గొని రాణించాలని సూచించారు. విజేత స్కూల్ హెడ్‌మాస్టర్ బండి కల్పన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగేందర్, స్కూల్ కరస్పాండెంట్ బండి ప్రదీప్, వీరన్న, కుమారస్వామి, ఝాన్సీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కామిడి సతీష్‌రెడ్డికి స్పందన ఇంటర్నేషనల్ అవార్డు



హసన్‌పర్తి: స్పందన ఇంటర్నేషనల్ అవార్డును నగరంలోని గోపాలపురానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కామిడి సతీష్‌రెడ్డి అందుకున్నారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో సతీష్‌రెడ్డిని స్పందన ఫౌండేషన్ చైర్మన్ ఈడే శామ్యుల్‌రెడ్డి అవార్డుతో సన్మానించారు. విద్యారంగంలో అంకితభావంతో పనిచేస్తూ, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నందుకు ఈ అవార్డును తనకు అందజేసినట్లు సతీష్‌రెడ్డి తెలిపారు. కాగా, ప్రస్తుతం సతీష్‌రెడ్డి రేగొండ మండలం రామన్నగూడెం తండాలోని పాఠశాలలో పనిచేస్తున్నారు.

విశ్వరూప మహాసభకు తరలిన నాయకులు



కాజీపేట: హైదరాబాద్‌లో జరిగిన పీఎం నరేంద్రమోదీ విశ్వరూప మహాసభకు కాజీపేట నుంచి మూడు బస్సుల్లో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తరలివెళ్లారు. కాజీపేట చౌరస్తాలో జిల్లా ఇన్‌చార్జ్ బండారి సురేందర్‌మాదిగ జెండా ఊపి బస్సుయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిర్ర నర్సింగ్‌గౌడ్‌తో పాటు కార్యకర్తలు తరలివెళ్లారు.

కేయూ నుంచి విద్యార్థులు

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని మాదిగల విశ్వరూప మహాసభకు కాకతీయ యూనివర్సిటీ నుంచి మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఇన్‌చార్జ్ డాక్టర్ వడ్డెపెల్లి మధు ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులు, మాదిగ పరిశోధక విద్యార్థులు బస్సులో శనివారం తరలివెళ్లారు. సభకు వెళ్లిన వారిలో డాక్టర్ శ్రీనివాస్, రవీందర్, భిక్షపతి, సత్యజాల, చిలువేరు రాజ్‌కుమార్, దానయ్య, సంజీవ, ప్రభాకర్, వీరస్వామి, నాగేశ్వర్‌రావు, రవి, స్వామి, మంద భాస్కర్, సంపత్, కిరణ్ తదితరులు ఉన్నారు.

మాదిగలను మోసం చేసిన మోదీ గో బ్యాక్



కాజీపేట అర్బన్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తానని పదేళ్లుగా మోసం చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శనివారం హైదరాబాద్‌కు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని, మోదీ గో బ్యాక్ అంటూ తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లో నాయకులు నిరసన తెలిపారు. 2014 తిరుపతి సభలో మోదీ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటివరకు వర్గీకరణ చేయకుండా ఎన్నికల కోసమే ఇప్పుడు హైదరాబాద్‌కు మోదీ వస్తున్నారని టీఎంహెచ్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈదునూరి యాకయ్య, కొట్టె పద్మయ్య తెలిపారు. మోదీని మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు నమ్మకూడదని, మందకృష్ణ మాదిగ బీజేపీకి మాదిగ ఓట్లను అమ్మకోవడం సరికాదని సూచించారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం


ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న కాలనీవాసులు

హన్మకొండ: జాతీయ విద్యా దినోత్సవాన్ని, దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని హనుమకొండ హనుమాన్‌నగర్ –1లో వాసులు శనివారం జరుపుకున్నారు. అబుల్ కలాం చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి, కాలనీవాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 10ఏళ్ల జైలుశిక్ష అనుభవించారని తెలిపారు. విద్య ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించి విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన సందర్భంగా ఆయన జన్మదినాన్ని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మొట్ల మనోహర్, శ్రీనివాస్, కుమార్‌రెడ్డి, చిర్ర శ్రవణ్, రాజ్‌కుమార్, వెంకటేష్, మోహన్, రాజేందర్, సాయి, మనోజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ధర్మగుణం కలిగి ఉండాలి


అనఘాష్టమి వ్రతం నిర్వహిస్తున్న వేదపండితులు

హన్మకొండ కల్చరల్: ప్రతిఒక్కరూ ధర్మగుణం కలిగి ఉండాలని దత్తపీఠ ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థస్వామిజీ ఉద్బోధించారు. దీపావళి వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం ములుగురోడ్డులోని వరద దత్తక్షేత్రంలో స్వామిజీ ఆధ్వర్యంలో వేద పండితులు విశేష పూజలు, వెయ్యిమంది భక్తులతో సామూహిక అనఘాష్టమి వ్రతం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో దత్తక్షేత్రం ట్రస్ట్ సభ్యులు వైవీ.వామన్‌రావు, శివరామకృష్ణ ప్రసాద్, వెంకటేశ్వర్లు, డాక్టర్ లక్ష్మినారాయణ, డాక్టర్ శార్వాణి, శివకుమార్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 10గంటలకు సూక్తయాగం, సాయంత్రం 6గంటలకు ధనలక్ష్మి పూజ జరుగుతుందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

పాఠశాలలో బాలల దినోత్సవం


మొక్క నాటుతున్న నిట్ ఎన్ఎస్ఎస్ కేడెట్లు

విద్యారణ్యపురి: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం పలు రకాల పోటీలు నిర్వహించారు. డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసచార్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అజీమ్ ప్రకాశ్‌కొడాలి ఆధ్వర్యంలో ఒకటవ తరగతి నుంచి మూడవ తరగతి వరకు విద్యార్థులకు బొమ్మలు గీయడం, పదవినోదం, ఆపై తరగతుల విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో వరంగల్ నిట్ జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) విభాగం కేడెట్లు మొక్కలు నాటారు.

ముదిరాజ్‌లను బీసీ ఏ లో చేర్చడం దారుణం


వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

కాజీపేట అర్బన్: కామారెడ్డి బహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించి బీసీ డీ గ్రూపులో ఉన్న ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చుతామని ప్రకటించడం దారుణమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాక ఓంప్రకాష్ అన్నారు. ఈమేరకు హనుమకొండ ఏకశిల పార్కులోని తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. రేవంత్‌రెడ్డి తన ప్రకటనను వెనక్కి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్రాంతికుమార్, రవీందర్, కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.

ఏకశిల పాఠశాలలో మాక్ పోలింగ్


ఓటు హక్కు వినియోగించుకున్న విద్యార్థులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెంబర్తి క్రాస్‌లోని ఏకశిల టెక్నో స్కూల్‌లో శనివారం మాక్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఓటింగ్ వయస్సు రాకముందే ఎన్నికల ప్రక్రియను పరిచయం చేయడానికే మాక్ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రజాస్వామ్యం, ప్రభుత్వ పాత్రపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సువిజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ స్వరాజ్, అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జ్ రాంప్రసాద్, ఉపాధ్యాయులు ప్రశాంత్, వీరేశం, శ్రీనివాస్, ప్రియాంక, రితిక, మానస పాల్గొన్నారు.

మాజీ న్యాయమూర్తి సుదర్శన్‌కు సన్మానం


సుదర్శన్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

వరంగల్ లీగల్: హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సదస్సుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్ హాజరయ్యారు. అంతకుముందు ఆయనకు హనుమకొండ, వరంగల్‌కు చెందిన న్యాయవాదులు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు ఆనంద్‌మోహన్, దయ్యాల సుధాకర్‌యాదవ్, చిల్ల రాజేంద్రప్రసాద్, రామనాథం, చిర్ర సాంబశివరాజు గౌడ్, పసునూటి రమేష్, కృష్ణస్వామి, పిల్లి కార్తీక్, దుగ్గి అచ్యుత్ కుమార్, అరుణ్, సాయిని నరేందర్, రాచర్ల ప్రవీణ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సేవ.. విశ్వ మానవ సేవ

దేశాయిపేట: దివ్యాంగులకు సేవ చేస్తే విశ్వంలోని మానవులకు సేవ చేసినట్లే అని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ నిర్వాహకురాలు డాక్టర్ అనితారెడ్డి అన్నారు. ఆటోనగర్‌లోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాల విద్యార్థులకు దీపావళి పండుగ సందర్భంగా మూడు రోజులపాటు పిండి వంటలు, స్పెషల్ భోజనం పెట్టేందుకు కావాల్సిన సామగ్రి, పండ్లు, స్వీట్లను పాఠశాల నిర్వాహకులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతలు అంధ విద్యార్థులకు చేయూతనందించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీలత, మణికంఠ, పిల్లలు, సిబ్బంది పాల్గొన్నారు.

అంధులకు బాణసంచా పంపిణీ


బాణసంచా పంపిణీ చేస్తున్న రాము

వరంగల్ చౌరస్తా: హనుమకొండ అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో అంధులకు సింహాద్రి నరసింహ ఫైర్ వర్కర్స్ యజమాని తాటికొండ రాము.. బాణసంచాను ఉచితంగా పంపిణీ చేశారు. అంధుల జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలని ఉద్దేశంతో బాణసంచాను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ అనితారెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో దీపావళి వేడుకలు

రామన్నపేట / మామునూరు: నాయుడు పెట్రోల్ బంక్ సమీప కాలనీలోని సాయి వృద్ధాశ్రమంలో వరంగల్ రామన్నపేటకు చెందిన డాక్టర్ రాజేంద్రప్రసాద్, భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు కాకర వత్తులు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రవణ్, మోహన్, శ్రీనివాస్, లావణ్య, బిందు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఇష్టాలను గుర్తించాలి



ఖిలా వరంగల్: పిల్లల ఇష్టాలను తల్లిదండ్రులు గుర్తించి ఇష్టమైన రంగంలో వారు రాణించేందుకు దోహదపడాలని ట్రస్మా జిల్లా ప్రతినిధి, వందన హైస్కూల్ ప్రిన్సిపాల్ ఆడెపు శ్యాంసుందర్ సూచించారు. ప్రకృతిలో లభించే పలు రకాల పండ్ల విశిష్టతపై చిన్నారులకు అవగాహన కల్పించేందుకు ఫ్రూట్స్ డేను ఉపాధ్యాయులు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వరంగల్ శివనగర్‌లోని వందన హైస్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ విజయకుమారి ఆధ్వర్యంలో ఫ్రూట్స్ డేను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్త దాతృత్వం


స్పృహతప్పి ఉన్న వ్యక్తిని పరిశీలిస్తున్న ఫసీ

ఖిలా వరంగల్: ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడు మతిస్థిమితం కోల్పోయి దూపకుంట రోడ్డులోని నిర్జన ప్రదేశంలో పడిపోయి కనిపించాడు. పంట పొలాల చాటున మూడు రోజులుగా తిండి, తాగునీరు లేక నీరసంగా పడిఉన్న ఆ వ్యక్తి స్థానిక రైతులు కంటపడ్డాడు. ఈ విషయాన్ని స్థానిక సామాజిక కార్యకర్త ఎండీ.ఫసీకి వారు శనివారం తెలిపారు. ఆ వ్యక్తి వద్దకు ఫసీ చేరుకుని భోజనం, తాగునీరు అందజేసి, అనంతరం చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

'సాఫ్ట్‌పాత్'లో దివాళి సంబరం

నయీంనగర్: హనుమకొండ నయీంనగర్ సీడీయూ క్యాంపస్‌లోని సాఫ్ట్‌పాత్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో దీపావళి వేడుకలను శనివారం నిర్వహించారు. బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ హాజరయ్యారు. కార్యక్రమంలో కంపెనీ ఐటీ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతీక దీపావళి



ఖిలా వరంగల్: భారతీయ ధర్మానికి, సంస్కృతికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగను కాలుష్య రహితంగా జరుపుకోవాలని శివనగర్ ఏకశిల డీజీ స్కూల్ డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి సూచించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని వరంగల్ శివనగర్‌లోని ఏకశిల డీజీ స్కూల్ ప్రాంగణంలో వైస్ ప్రిన్సిపాల్ లవకుమార్ ఆధ్వర్యంలో ఎకో ఫ్రెండ్లీ దీపావళిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి 108 దీపాలను వెలిగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని చేయని బాణసంచాను మాత్రమే ఉపయోగించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శించారు.